గంగరాజు సాలోచనగా మొహం పైకెత్తి తల గోక్కుంటూ ''ఎక్కడో చూసినట్లే..ఉంది సార్..'' అన్నాడు పరీక్షిత్తు అటూ ఇటూ పచార్లు చేసి నాలుగు క్షణాలాగి అన్నాడు - ''నువ్వు అన్నదాంట్లో పాయింటు లేకపోలేదయ్యా సనకసనందనం ! శిలాశాసనం పాతించటం కాదు గాని మనం ఓ పని చెయ్యొచ్చు. పైన దూలం మీద ఫాను పక్కగా 'ఈ ఫాను ప్రిన్సిపాలు గారి గదికి ప్రెజెంట్ చెయ్యబడింది. కదిలించగూడదు' అని చెక్కిస్తే ఎట్లా ఉంటుంది?''

ఇట్లా అంటూ పరీక్షిత్తు గంగరాజు వైపు చూడగా, గంగరాజు సనకసనందనాన్ని చూడగా, సనక సనందనం పరీక్షిత్తు వైపు చూసాడు. చూస్తూ హఠాత్తుగా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అన్నాడు సనకసనందనం- '' మీ అయిడియా బ్రిలియంట్ సార్ ! ... అయితే ఎవర్నో పిలవటం దేనికి సార్.నేనే సుత్తీ ఉలీపట్టు కొచ్చి దూలం మీద చెక్కేస్తాన్సార్. బాగా కనిపించడానికి రెడ్‌పెయింట్‌తో అక్షరాల్ని దిద్దితే సరి. ఏమంటార్ సార్? ఇది కూడా ఒకరకంగా శిలాశాసనమే కదా సార్ ! ఇహ దీన్ని ఎవడూ కదిలించలేడండి!''

''వెల్, వెరీ గుడ్ అయితే వెంటనే కానిచ్చెయ్''.

'' ఇప్పుడు కాదు రేపు కాలేజీకి వచ్చేప్పుడు పనిముట్లుతెచ్చుకుంటాను. ఎంతసార్ పావుగంట పని''... '' రేపా? ఆల్ రైట్!''

★★★

ఇంతలో పోస్టుమాన్ పోస్టు తెచ్చాడు.

అందులో ప్రిన్సిపాల్ పరీక్షిత్తుకు ఒక ఆర్డరుంది? ఎన్.సి.ఇ.ఆర్.టి. వాళ్ళు నిర్వహిస్తున్న ఆర్నెల్ల ట్రెయినింగుకు అతన్ని సెలక్టు చేసారనీ, వైస్ ప్రిన్సిపాల్ లవకుశరావుకు ఫుల్ అడిషనల్ చార్జి ఇవ్వబడిందనీ, లవకుశరావు చార్జి అప్పగించి తక్షణం బయల్దేరి మర్నాటికల్లా పరీక్షిత్తు రిపోర్టు చెయ్యాలని - దాని సారాంశం!

పరీక్షిత్తు చేతిలోంచి కాగితం జారిపడిపోయింది. తలెత్తి పైన తిరుగుతున్న ఫాను వైపు చూసి గట్టిగా నిట్టూర్చాడు. ఉసూరుమంటూ జారి కుర్చీలో కూలబడిపోయాడు - స్పెషల్ ట్రెయినింగుకు సెలక్టయిన కాబోయే పి.హెచ్.డి సీనియర్ మోస్టు ప్రిన్సిపాల్ అయిన శ్రీమాన్ పరీక్షిత్తు!

(జాగృతి దీపావళి సంచిక 1980)

★★★ ★★★ ★★★

# రాజుగోల

''నా చిలకల కొలొకి, నా రత్నాల మొలక, నా వజ్రాల తునక, నా ముత్యాల మూట, నా నోముల్ల పంట నా రాజనిమ్మల పండు''.. ''అదుగో అదుగో అదే అనొద్దన్నాను రోజాదేవీ! ఎన్నైనా అను పిల్లాడ్నీ. కానీ రాజు అని అనొద్దన్నాను. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. ఇది ప్రజల రాజ్యం కార్మికుల రాజ్యం. నా రాజనిమ్మలపండు అని ఇంకెప్పుడూ అనకు! కావలిస్తే నా కూలి నిమ్మలపండు అను''

కూలి నిమ్మల పండా! ఏడ్చినట్టే ఉంది!,,,, అయినా నా పిల్లాడు నా ఇష్టం ! నేనేమయినా అనుకుంటాను! మధ్యలో మీకెందుకు! అనవసరంగా ప్రతిదానికీ కల్పించుకోకండి!''

"అదుగో ఇంకో అనకూడని మాట! నా పిల్లాడేవిటి మన పిల్లాడను ! సోషలిస్టు రాజ్యంలో ఆస్తి హక్కులేదు తెలుసా?'' . "పొద్దున్నే ఇదేం మాయదారి గోలమ్మా !... అయినా మీకు ఆస్థెక్కడేడ్చింది హక్కుకి!..''

" ఈ బట్టలూ, నగలూ, సామాన్లు ఆస్థి కావూ? మీ నాన్నిచ్చిన ఆరెకరమూ ఆస్తికాదా? నువ్వూ మన ముగ్గురు పిల్లలూ ఆస్తి కాదూ?'' ... " ఏంటీ పిల్లలూ నేనూ ఆస్తా? మీ ఆస్తా? అంటే మేము చెంబూ తప్పేలాల్తో సమానమన్నమాట! చిల్లి చెంబును మార్చినట్టు మార్చేస్తారన్నమాట!... పోనీ అట్లా అనుకున్నప్పటికి ఆస్తి అందరికీ చెందాలంటున్నారు గదా ... నేను... ఊళ్లో అందరికి...'' ... " నాన్‌సెన్స్! ఎద్దేమంటే తెడ్డేమంటావ్ ! నీకు జ్ఞానోదయమెప్పుడవుతుందో గదా! నేను చెప్పేది సోషలిజం వచ్చే రోజు గురించి. అదొచ్చిన్నాడు మన దేశం స్వర్గం అవుతుంది. అసలప్పుడు నువ్వీ ప్రశ్న అడుగుతావా అని! నువ్వీప్రశ్న అడగక్కర్లేకుండా చెయ్యవలసిదంతా పార్టీయే చేసేస్తుంది... పన్నుసుకో పో, దేబి మొహం దేవీ!''

★ ★ ★

"నజజజజజవ - ఎనిమిదీ పద్నాలుగు, న జ జ వ - ఎనిమిదీ పధ్నాలుగూ, నజ న జ జ జ జ జ - ఎనిమిదీ పధ్నాలుగూ...''

"నత్తి వాడికి మల్లే ఆ గోలేంట్రా గాడిదా! ఇదేనా పరీక్ష చదువు ! ''

" పరీక్ష చదువే నాన్నా. ఇది కవిరాజ విరాజితమనే పద్యం లక్షణం. నానారాజ సందర్శనం అనే పుస్తకంలో ఒక ముఖ్య పద్యం కోసం గణాలు కంఠస్థం చేస్తున్నా.''

"ఏంటీ కవిరాజవిరాజితమా! నానా రాజ సందర్శనమా! రాజా! ఇక్కడకూడా రాజున్నాడా !... వీల్లేదు, రాజులుండటానికి వీల్లేదు! ఆ పద్యం చదవకు!''

" .... చదకపోతే ఎట్లా ! మహాకవుల పద్యాలు కోట్ చేస్తే మంచి మార్కులు పడతాయి.... పోన్లే మానేస్తాను. గద్యం చదువుకుంటాను... దాంపత్య ధర్మమూ, నన్నయభట్టారకుడూ, కవిజీవితాదులూ, ఈ కవిరాజు సాంస్కృతిక కాల రాజ మనదగిన పదకొండవ శతాబ్దమున రాజమహేంద్రవరమును రాజధానిగా చేసుకొని రంజితముగ పాలించిన తూర్పు చాళుక్యరాజగు రాజ రాజనరేంద్రుని ఆస్థానకవి. ఆ మహారాజు....''... " అబ్బబ్బ !.... రాజూ రాజూ రాజూ! రాజూ ప్రతిక్షణమూ ఈ రాజుగోల తప్పితే కొంపలో ఇంకేమీ వినిపించదా? మిమ్మల్నందర్నీ తీసికెళ్లి బుద్ధి శుద్ధి చేయించేస్తాను జాగ్రత్త !.... తెలుగాపెయ్, ఇంకేదైనా ఏడు!... ఊ!''

★ ★ ★

... శిరమున శ్రీయుత కిరీటము రంజిల భుజముల రంగొ భుజకీర్తులు వర్థిల రాజు వెడలె రవితేజము లలరగ రాజూ వెడలె రవి తేజాము లలరగ రాజు వెడలె . రాజూ వెడలె - సభకు!...ఇవ్విధంబుగా ఉషాజనకుండైనా అమ్మహా రాజు....

"నీలిమా, రేడియోలో స్టేషను మార్చెయ్!" .. " అల్లాగే నాన్నా... చక్కని యక్షగానం వస్తోంది, నీ పిచ్చిగాని!"

★ ★ ★

శుక్.. బులుక్....డబ్ క్చ్ క్చ్... ఇప్పుడు మన ప్రియతమ కవిసార్వభౌములు స్వీయ కవితాగానం చేస్తారు. కవిత పేరు 'హైందవ ప్రశస్తి' వారి గానం వినండి.

రాజసమ్ము మొలికించె రాణా ప్రతాపుండు రాణకెక్కిన శౌర్యరాజితోడ... ఛత్రపతి మహారాజు శివాజీ నిలిపుంచె అదరంగా జౌరంగజేబునౌర .. ఝాన్సీరాణియు ముంచె జాజ్జ్వల్య శౌర్యాగ్ని ఆంగ్లేయ రారాజు అహమునెల్ల ...

" కట్టెయ్‌వే అమ్మాయ్ కట్టెయ్ రపీమని కట్టెయ్ ! దీన్ని కట్టెతో చావ గొట్టినా పాపంలేదు. వెధవ రేడియో! ఎప్పుడూ ఆ ఫ్యూడల్ బూతుకూతలే! ఎవడో బూర్జువా ఓంద్రపెడితే ఇంకో బూర్జువా కుక్కుతాడు ఈ డబ్బాలోకి! ఛి, ఛి..." ..." సరే నాన్నా" - టప్

★ ★ ★

"నాన్నా నీ పద్ధతేం బాగుండలేదు. ఏమిటి, మేమూ అమ్మా నీ ఆస్తా ! తమ్ము డసలు తెలుగు పారమే చదవకూడదా! దేశ భక్తి గీతాలు కట్టెయ్యాలా! నువ్వూ దేశ భక్తుణ్ణంటూంటావు గదా, ఏ దేశ భక్తుడివో కాస్త చెబుతావా!.. అసలు నువ్వు కలలుగనే కూలిరాజ్యం ఎక్కడుందో కాస్త చెప్పునాన్నా, ఫ్యాక్టరీలు మూతబడ్డ పోలెండులోనా? ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించి తొక్కితాండవం చేస్తున్న రష్యాలోనా? నేటి నాయకులు నిన్నటి నాయకుల్ని దుమ్మెత్తిపోసి కొరత వేస్తున్న చైనాలోనా?"

" ఒరేయ్ నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు. నేను రాజరిక వ్యతిరేకిని నేను కలలుగనే రాజ్యం అందరూ కూలీలయిపోయే రాజ్యం ఇవ్వాళ కాకపోతే రేపొస్తుంది ! సోషలిస్టు రాజ్యస్థాపన నా లక్ష్యం !" ... " రాజరికాలకీ వంశపారంపర్య పాలనకీ నువ్వే కాదు, నేనూ వ్యతిరేకినే. దేశంలో అనేక లక్షల మంది యువకులు కూడా వ్యతిరేకులే. కానీ రాజు అనేమాట ఏం పాపం చేసింది?... శ్రేష్ఠమైనవాడు, ఉన్నతుడు అనే అర్థంలో దాన్ని వాడితే నష్టమేమిటి"

"వీల్లేదు. రాజరికం చాయల్ని సూచించే ఎట్టి అవశేషాల్నీ, ఫ్యూడల్ రెలిక్స్‌నీ మేం సహించం. ముఖ్యంగా రాజును!".." అయితే అమ్మని దేవీ అని పిలుస్తా వెందుకు?"... "ఏం" ..."దేవీ అంటే రాజు యొక్క పట్టమహిషి అయిన భార్య అని అర్థం. పట్ట మహిషి కాని భార్యను భట్టిని అంటారు."... " అయితే ఇహనించీ అట్లా పిలవన్లే" "సరే, నువ్వు కూడా నీ రాజుపేరు మార్చేసుకుంటావా?"

"నా పేరు రాజు కాదు. చంద్ర"... " రాజంటే చంద్రుడనే అర్థం ఉంది."... " ఓహో... అయితే మార్చేసు కుంటాను. ప్రకాశరావు అని పెట్టుకుంటాను" .. " ప్రకాశించువాడు అనటానికి రాజిల్లు వాడు అంటారు. రాజు ఎక్కడొదిలినట్టు?"

"అక్షయుడు- అంటే నాశములేనివాడు అని అనుకుంటాను- ఆ పేరు పెట్టుకుంటాను"

"నిన్ను అక్షయుడుగారూ అని పిలిచినప్పుడల్లా క్షయవ్యాధి అంటే, రాజయక్ష్మ వ్యాధి, గుర్తు కొస్తుంటుంది. రాజ, రాజ, రాజయక్ష్మ !"

"అయితే...సింహం! సింహాలు అని పేరుపెట్టుకుంటానయ్యా!"

"సింహమా, మృగరాజా, భలే ! ఎడమచెయ్యి తీసి వామహస్తం పెట్టమన్నాట్ట ఎవడో!"... "సరేలేవోయ్, వెధవ తెలివి !... ఊఁ ఊఁ... విద్యార్థి అని పెట్టుకుంటాను. దీనికింక తిరుగేముంది?... అహ్హా హ్హా హ్హా హ్హా!.."

"విద్యార్థా!... ఆగాగు...శ్రేష్ఠత్వానికి దీనికీ కూడా ఎక్కడో ఏదో సంబంధం ఉండే ఉంటుంది. ఆఁ.. విద్యార్థి రాజో విటసార్వభౌమః- అంటే విద్యార్థుల్లో శ్రేష్టుడు విటుల్లో కూడా శ్రేష్టుడవుతాడూ అని!... పాతకాలపు నానుడే అనుకో. కానీ శ్రేష్టత్వం చెప్పవలసి వచ్చినపుడు రాజు శబ్దం తప్పలేదే!

"పిచ్చినాన్నా, అసలీ ప్రయత్నం నువ్వెందుకు మానవని? హిందూ రాజులకు పాశ్చాత్యరాజులకూ మనస్తత్వాల్లో ఉన్న మూలభేదం ఏమిటో గ్రహించటానికి నువ్వెప్పుడైనాప్రయత్నించావా అని? ఏ జీవన సూత్రాల ఆధారంగా అనేకానేక ఏళ్లనించీ ఈ భారతీయ సమాజం నిశ్చలంగా ప్రవహించే ఒక మహాజీవ నదిలాగా తన మనుగడ సాగిస్తోందో అధ్యయనం చేసేందుకు నువ్వెన్నడైనా నడుంకట్టావా అని?"

"జీవన సూత్రాలా! ఛ, ఛ, ఇవ్వేం పన్చెయ్యవ్!... విప్లవం ఒకటే మార్గం. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం మారుతుంది! మా విప్లవ నినాదాలు అందుకొని ప్రజలు తిరగబడ్డారు. సింహాసనాల్ని కూలదోసారు. రాజరికాలు తుడిచిపెట్టుకుపోయాయి. తెలుసుకోరా నాగన్నా!"

"అవును కానీ ఎక్కడ? భారత దేశంలో కాదే ! విప్లవాల్ని ఆహ్వానించేంత క్రౌర్యం అక్కడ ఉన్నంతగా ఇక్కడ ఏనాడూ లేదు!... అక్కడ రాజరికాలు తుడిచిపెట్టుకు పోయాయన్నది రైట్! కానీ రాజులు పోయారన్నది రాంగ్! నువ్వు విప్లవాల్ని నడిపించిన చోట ఇప్పుడు రాజ్యాల్ని ఏలుతున్న నాయకులు అక్కడి పూర్వపు రాజులకన్నా అనేక వందల రెట్లు ఎక్కువగా పీడిస్తున్నారు. అనేక వేల రెట్లు ఎక్కువ భోగాలు అనుభవిస్తున్నారు. నీ 'కట్టు-కొట్టు-చంపు' సిద్ధాంతాన్ని ఇక్కడక్కూడా దిగుమతి చేసి ఆ రాక్షసుల్ని ఈ దేశంలో కూడా ప్రతిష్టిస్తానంటావా? పిచ్చి నాన్నా, అదెట్లాగూ జరిగేపని కాదు. అసలీలోపల ఇక్కడి సంస్కృతి ప్రవాహంలో నువ్వు చరిత్ర హీనంగా కొట్టుకుని పోతావేమో చూసుకో!...

"ఇంకా, నీ సిద్ధాంతాన్నుపయోగించకుండానే మహాతేలిగ్గా పాలకుల్ని మార్చెయ్యటం ఎట్లాగో ఈనాటి మా కుర్ర కారుకు బాగా తెలుసు. అనేక సార్లు మహా మహానాయకుల్ని మట్టికరిపించాం, మళ్లీ పైకెత్తాం, మళ్లీ దించుతాం అవసరమైతే! చిటికెలో పని నాన్నా! అంతా కలిపి మూడు నిముషాలు!.... పోలింగ్ బూత్ కెళ్లి ఆ కాగితం మీద దాన్ని - అదే, ఆ ముద్రని - గుద్దేస్తే, అంతవరకూ శిఖరాల తేలిన మహా మహా నాయకులు ఆ మర్నాడు పాతాళానికి దభీమని పడతారు. అంచేత, రాజు పదం పోవాలని కాదు నాన్నా నువ్వు ఘోషించవలసింది. మన భారతీయ జీవన సరళిని అర్థం చేసుకొని వాటి ఆధారంగా మనం ఒక అజేయమైన జాతిగా సుసంఘటితమవ్వాలని మా ఈ తరం యువకుల్తో కలిసి ఘోషించు. నిజంగా మా మంచి కోరిన నాన్నవవుతావు! నువ్వూ, మేమూ కలలుగంటున్న భూతల స్వర్గం ఇక్కడే ఈ దేశంలోనే దానంతట అదే వెల్లివిరుస్తుంది."

(జాగృతి- స్వాతంత్ర్యదిన ప్రత్యేక సంచిక 1983)

★★★ ★★★ ★★★